## 'మనూ' విద్యార్థి సంఘం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం నూతన విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా మతీన్ అశ్రఫ్ ఎన్నికయ్యారు. ఉర్దూ విశ్వ విద్యాలయంలో గురువారం సాయంత్రం విద్యార్థి సంఘం ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిశాయి. 2023-24 విద్యాసంవత్సరానికిగాను ఎన్నికలను నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన మతీన్ అశ్రఫ్ ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థి. సంఘం నూతన ఉపాధ్యక్షుడుగా నిజాముద్దీన్, కార్యదర్శిగా సయ్యద్ సల్మాన్ అలీ, జాయింట్ సెక్రెటరీగా షుగుఫ్తా ఇక్బాల్, కోశాధికారిగా అల్తాఫ్ హుస్సేన్ ఎన్నికయ్యారు.

## నేడు కన్స్యూమర్ డే

మాదాపూర్: ఎలక్ట్రిసిటీ కన్స్యూమర్ కోర్టును శుక్రవారం కొండాపూర్‌లోని 33కేవీ సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్నారు. కరెంటుకు సంబంధించిన సమస్యలను వినియోగదారులు తెలుపవచ్చు. అల్లాపూర్, కొండాపూర్, వైట్‌ఫీల్డ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో.. లైన్ల సమస్య, బిల్లింగ్, కరెంటు హెచ్చు,తగ్గులు తదితర సమస్యలను తెలుపవచ్చు.

## ఆలయ వార్షికోత్సవం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని మహంకాళి ఆలయ 22వ వార్షికోత్సవంను ఆలయ నిర్వాహకులు గురువారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5 గంటల నుండి అభిషేకం,గణపతి పూజ, ప్రధాన దేవత మండపారాధన ,చండి సప్తశతి హోమం చేశారు.అనంతరం ఆలయ గౌరవ అధ్యక్షులు సపానదేవ్, కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం దేవస్థానంలో లలితా సహస్రనామ పారాయణం, పుష్పార్చన చేశారు.

# కమలంలో కాక..

- మూడవ జాబితాలోనూ రాని స్పష్టత
- జనసేనకు కేటాయిస్తారని ప్రచారం
- ఇప్పటికే అధిష్టానానికి అల్టిమేటం ఇచ్చిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- జోష్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కేడర్

గచ్చిబౌలి: శాసనసభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ, జనసేనల మధ్య అకస్మాత్తుగా కుదిరిన పొత్తు కారణంగా బీజేపీ నాయకులు, కేడర్ ఆందోళనలో ఉన్నారు. పార్టీ కోసం శ్రమించిన నాయకులకు టికెట్ విషయానికి వచ్చేసరికి తెరపైకి వచ్చిన పొత్తులు చుక్కలు చూపిస్తున్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లి అభ్యర్థి ఎంపికలో బీజేపీ అధిష్టానం మీనమేషాలు లెక్కించడంను కేడర్ జీర్ణించుకోలేకపోతోంది. ఎన్నికల వేళ కేడర్ లేని జనసేనకు టికెట్ ఇస్తే ప్రయోజనం ఏంటని బీజేపీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అధిష్టానం ఇలాంటి వైఖరి కొనసాగిస్తే పార్టీ ఉనికికే ప్రమాదమని పరిశీలకులు అంటున్నారు. సెటిలర్స్‌తో పాటు నార్త్ ఇండియన్స్ ఎక్కువగా ఉన్న శేరిలింగంపల్లి టికెట్‌ను జనసేనకు కేటాయించవద్దని నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ జనసేనకు టికెట్ కేటాయిస్తే పని చేసే ప్రసక్తే లేదని కొందరు తెగేసి చెబుతున్నారు.

### మూడో జాబితాలోను దక్కని చోటు

శేరిలింగంపల్లి టికెట్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్, గత ఎన్నికలో బరిలో నిలిచిన గజ్జెల యోగానంద్, మొవ్వ సత్యనారాయణతో పాటు మరి కొంతమంది టికెట్‌ను ఆశించిన వారిలో ఉన్నారు. రవికుమార్ యాదవ్, గజ్జెల యోగానంద్ జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో ప్రతిష్టాత్మకంగా పని చేశారు. మూడేళ్ల వారు ప్రజా సమస్యలపై నిరంతరం కార్యక్రమాలు చేస్తూనే ఉన్నారు. టికెట్ తమకే వస్తుందన్న ధీమాతో అన్ని ఏర్పాటు చేసుకున్నారు. మొదటి జాబితాలో రాకపోవడంతో రెండో జాబితాలో వస్తుందనుకున్నారు ఒక్క పేరుతో రెండో జాబితాను విడుదల చేసిన బీజేపీ అధిష్టానం ఆ పార్టీ నాయకులను ఆశ్చర్యపరిచిందనే చెప్పాలి. టికెట్ కోసం తీవ్రస్థాయిలో పోటీ ఉండటంతో మూడవ జాబితాలో టికెట్ వస్తుందని ఆశించారు. పొత్తుల్లో భాగంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి టికెట్లను జనసేన అడుగుతుందనే ప్రచారం మొదలైంది. అందుకు తగ్గట్లుగా మూడవ జాబితాలోను ఆ రెండు నియోజకవర్గాలను పెండింగ్‌లో పెట్టడంతో క్యాడర్‌లో మరింత ఆందోళన నెలకొంది. పొత్తు ధర్మంలో జనసేనకు ఇస్తే మాత్రం పార్టీ క్యాడర్ విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉంది. జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో టీఆర్‌ఎస్, బీజేపీల మధ్య నువ్వా- నేనా అన్నట్లు పోటీ ఇచ్చారు. 10 డివిజన్లలో బీజేపీ అభ్యర్థులకు దాదాపు 90 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నార్త్ ఇండియన్స్ ఓట్లు పెరిగాయని ముక్కోణపు పోటీలు గెలుపు అవకాశాలుంటాయని ఆ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకి టికెట్ కేటాయించకపోతే నియోజకవర్గంలో పార్టీ తీవ్రంగా నష్టపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి టికెట్ జనసేనకు ఇస్తున్నారన్న ప్రచారంతో అక్కడి బీజేపీ నాయకులు రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

### అల్టిమేటం పని చేస్తుందా?

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కీలకంగా మారింది. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలవాలంటే 7.18 లక్షల ఓట్లు ఉన్న శేరిలింగంపల్లిని బీజేపీకి ఇస్తేనే పార్లమెంట్‌లో ప్రభావం ఉంటుంది. ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నాయకులు టికెట్ కోసం లాబీయింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రవి కుమార్ యాదవ్‌కు టికెట్ ఇవ్వాలని పార్టీ సీనియర్ నాయకులు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధిష్టానానికి అల్టిమేటం ఇచ్చారు. ఇప్పటికే బీజేపీని వీడి ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్న తరుణంలో శేరిలింగంపల్లి టికెట్‌ను జనసేనకు కేటాయిస్తుందా లేదా అనేది మరో రెండు రోజుల్లో తేలుతుందని ఆపార్టీ నేతలు పేర్కొంటున్నారు.

### బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కేడర్‌లో జోష్..

సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి ఎన్నికల షెడ్యూల్‌కు ముందే టికెట్ రావడంతో పూర్తిస్థాయిలో ప్రచారంలో ఉన్నారు. అటు కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆత్మీయ సమ్మేళనాలతో ఓటర్లకు మరింత దగ్గరయ్యే కార్యక్రమాలు చేపడుతున్నారు. కాంగ్రెస్ రెండో జాబితాలో శేరిలింగంపల్లి టికెట్‌ను జగదీశ్వర్‌గౌడ్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. పార్టీ ఇంటింటి ప్రచారం, చేరికలపై దృష్టి సారించింది. ఇటు బీఆర్‌ఎస్, అటు కాంగ్రెస్ క్యాడర్‌లో జోష్ నెలకొంది.

## బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు

- గోకుల్ ప్లాట్స్‌లో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం, మదీనాగూడలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమక్షంలో గురువారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

**గోకుల్ ప్లాట్స్‌లో ఆత్మీయ సమావేశం**

మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో కాలనీవాసులతో గురువారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు కావలసిన మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. సమావేశంలో కాలనీ వాసులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీని భారీ మెజార్టీతో గెలిపించాలంటూ గురువారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రచారం చేశారు. డివిజన్ పరిధిలోని కాకతీయనగర్, వెంకట పాపయ్యనగర్, ఉజ్జయిని మహంకాళినగర్, చంద్రమ్మ కాలనీ, పంచమి కాలనీ, హనుమాన్ నగర్, తదితర కాలనీల్లో ఓట్లు అడిగారు

**కాలనీల్లో ప్రచారం**



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో అభివృద్ధి పనులు చేశామని మరోసారి తనను ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ కోరారు. గురువారం శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి ఇంటింటి ప్రచారం చేశారు. నెహ్రూనగర్, గోపీనగర్, బాపూనగర్‌లలో పర్యటించారు. యువకులు, మహిళలు, పార్టీ కార్యకర్తలతో కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు.

## చందానగర్‌లో కరపత్రాల పంపిణీ



ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. గురువారం డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్‌లో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డితో కలిసి ఇంటింటికి కరపత్రాలు పంచుతూ బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కారు గుర్తుకే ఓటు వేసి ఆరికెపూడి గాంధీని మూడవ సారి గెలిపించాలన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజ



ఓటుహక్కు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి దేవుజ, అధికారులు

పటాన్‌చెరు టౌన్: ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందని, అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవిజ అన్నారు.గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మహిళా సంఘాలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్‌తో కలిసి ఎస్‌వీఈఈపీ ( సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును వివరిస్తూ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు వచ్చారు. నవంబర్ 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు వేయాలన్నారు.పోలింగ్ రోజున వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, స్వీప్ నోడల్ ఆఫీసర్, అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మీడియా నోడల్ ఆఫీసర్, ఎంపీడీఓ బన్సీలాల్ పాల్గొన్నారు.

## వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.బుధవారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.బీజేపీ సీనియర్ నాయకులు రాంభూపాల్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుకున్నారని తెలిపారు .ప్రతిపక్ష పార్టీలు డిపాజిట్ల కోసం పోరాటం చేయాలన్నారు.అనంతరం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన యాదవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంషీగూడకు చెందిన మెతుకు కుటుంబ సభ్యులు, యువకులు జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, యూత్ నాయకులు ప్రణీత్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన డిజైర్ డిజైనర్ ఎగ్జిబిషన్‌ను నటి అనుశ్రీయ త్రిపాఠి, సిరి, నిర్వాహకురాలు అనిత అగర్వాల్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో అన్ని తరగతుల వారిని ఆకట్టుకునే విధంగా వస్త్రాలు ఉన్నాయని తెలిపారు. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు. పలువురు డిజైనర్లు, మోడల్స్ పాల్గొన్నారు.

## ఎఫ్ఈఐ 'సంగం' వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: చందానగర్ పీజెఆర్ స్టేడియం వేదికగా గురువారం ఎఫ్ఈఐ విద్యా సంస్థల అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవాల్లో భాగంగా విద్యార్థుల 'కాస్మిక్ లామ్ బె గస్' అంతరిక్ష యానం సాంస్కృతిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఎఫ్ఈఐ విద్యా సంస్థల అనుబంధ శాఖలైన క్రీక్ ప్లానెట్ సీడ్స్ మార్స్, సీడ్స్ యురేనస్, సీడ్స్ ఏరియన్, సీనియర్ సీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 'సంగం' అనే పేరు తో పాఠశాలల వార్షికోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఐఎస్‌ఆర్‌ఏ వైస్ ప్రెసిడెంట్, సైకాలజిస్ట్ డా.గౌతవరం చెంగల కవిత ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎఫ్ఈఐ విద్యా సంస్థల ఛైర్మన్ బొల్లినేని శీనయ్య, వైస్ ఛైర్మన్ టి.పాండురంగాచారి, ఫౌండర్-మేనేజింగ్ డైరెక్టర్ ఈడుపుగంటి నరేంద్ర ప్రసాద్, విద్యా సంస్థల అకడమిక్ హెడ్ డా.జయశ్రీ నాయర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బోని షా, షణ్ముగవల్లి అనిశెట్టి, నాగవల్లి భాగవతుల, కె.డామరిస్ పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభ చాటిన గీతం విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రీడా పోటీలలో తమ ప్రతిభ చాటారు. స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్‌లో బీఏ విద్యార్థిని అనఘా పాయ్ ప్రతిష్టాత్మక ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ -2023 మహిళల డబుల్స్ విభాగంలో మూడవ స్థానంలో నిలిచింది. మరోవైపు గీతం హైదరాబాద్ క్రికెట్ జట్టు అత్యంత పోటీతత్వంతో కూడిన హైదరాబాద్ లోని ఎంజీఐటీ కళాశాల నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో విజేతగా నిలిచి, తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది.

## 36.40 లక్షల గంజాయి, మద్యం సీజ్

- శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వెలువడినప్పటి నుంచి శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.36.40 లక్షల గంజాయి, విదేశీ మద్యం, చరాస్‌లను సీజ్ చేసినట్లు శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలంలో 109 కిలోల గంజాయి, 58 గ్రాముల చరాస్, 20 లీటర్ల నాన్ డ్యూటి స్టాంప్ పెయిడ్ మద్యం, 190 లీటర్ల అక్రమ దేశీయ మద్యం, 75 లీటర్ల బీర్లు, 1130 లీటర్ల కల్లును సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.36.40 లక్షలు ఉంటుందన్నారు. ప్రజలు తెలంగాణ ప్రభుత్వ మద్యం ఒరిజినల్ అని తెలుసుకోవడానికి 'వెరిట్' యాప్‌ను ఉపయోగించగలరని తెలిపారు. విదేశీ, అక్రమ మద్యం, గంజాయి నిల్వలు ఇతర అసాంఘిక చర్యల సమాచారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 18004252523కు సమాచారం అందించాలన్నారు.

### మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేటలోని టీ స్టాల్‌లో రాజు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్ఐ రమణ, సిబ్బందితో కలిసి గురువారం దాడి చేసి రూ.7,029 విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశారు.

## కాంగ్రెస్ గెలుపు ఖాయం



మదీనాగూడలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పూజితగౌడ్

హఫీజ్‌పేట్ : రానున్న ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత గౌడ్ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలో కార్యకర్తలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను ప్రజలకు వివరించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి జగదీశ్వర్ గౌడ్‌ను గెలిపించాలని కోరారు.

## రాకపోకలు ఎలా..?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీలోని ప్రధాన రహదారి దుస్థితికి చేరింది. పైపులైన్‌ల ఏర్పాటునకు ఒకవైపు రోడ్డును కొన్ని నెలల క్రితం తవ్వేశారు.పైప్‌లైన్ పనులు పూర్తయినప్పటికీ రోడ్డుకు మాత్రం మరమ్మతులు చేయడం లేదు.నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం ఒకవైపు నుంచే వాహనాలు రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు కొందరు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు.తాజాగా స్థానిక పోలీస్‌స్టేషన్ లో విధులు నిర్వహించే మహిళా కానిస్టేబుల్ విధులకు వెళ్తుండగా ఓ వాహనం ఢీకొట్టడంతో ఆమె ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. అధికారులు రోడ్డు మరమ్మతుపై దృష్టి సారించకపోవడం తగదని ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు



కార్యక్రమంలో వీసీ ఐనుల్ హసన్

రాయదుర్గం: మనూలో విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలు-2023 నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని లైబ్రరీ ఆడిటోరియంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పర్యవేక్షణలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ రఫీ మహ్మద్, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ముజాఫర్ హుస్సేన్‌ఖాన్, డాక్టర్ జరార్ అహ్మద్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గం చెరువులో మృతదేహం లభ్యం

మాదాపూర్: మాదాపూర్ దుర్గం చెరువులో కేబుల్‌బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం గురువారం వెలికితీశారు. మూడు రోజుల నుంచి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ సంజీవనగర్‌లో నివాసముంటున్న దారంగుల శంకర్ (28) మాదాపూర్‌లోని సత్వ బిల్డింగ్‌లో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇతను భార్య, ఇద్దరు పిల్లలతో కలసి జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై మంగళవారం కేబుల్ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్లపై సంతలు.. ఇక్కట్లు

- కూరగాయల దుకాణాలతో వాహనదారులు, స్థానికుల పాట్లు
- అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని వైనం



మంజీరా రోడ్డులో సంత నిర్వహణ

హఫీజ్‌పేట్ : కాలనీల చెంత వారాంతపు సంతలు వెలిశాయి. మియాపూర్, హఫీజ్‌పేట్, వివిధ ప్రాంతాలలోని కాలనీలలో రోజుకో కాలనీలో రైతులు, వ్యాపారులు వచ్చి కూరగాయల దుకాణాలు నిర్వహిస్తున్నారు. గంగారం, హుడా కాలనీ, ఆర్టీసీ కాలనీ, మదీనాగూడ గ్రామంలో, మైత్రినగర్ మంజీరా రోడ్డులో, ఆల్విన్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద, మాతృశ్రీనగర్, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. కాలనీలవాసులకు తాజా కూరగాయలు లభిస్తున్నప్పటికీ ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. సంతల రోజు ఆయా ప్రాంతాల్లో నడిచే వీలు కూడా ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు మిగిలిపోయిన కూరగాయలను విక్రయదారులు రోడ్లపైనే పారబోస్తుండడంతో అపరిశుభ్రత నెలకొంటోంది. సంత నిర్వహించిన మరుసటి రోజు రోడ్డుపైన భారీగా చెత్త పేరుకుపోతుంది.

- సంతలను రోడ్లపై కాకుండా కాలనీలోని ఖాళీ స్థలాలలో ఏర్పాటు చేయాలి
- అంతర్గత రోడ్లపై సంత నిర్వహించాలి
- డివిజన్ల పరిధిలో మోడల్ మార్కెట్‌లు పెట్టాలి
- సంత ఉన్న రోజు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా మరో మార్గంలో వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలి
- వ్యర్థాలను వేయడానికి చెత్త డబ్బాలను అందుబాటులో ఉంచాలి.

### మోడల్ మార్కెట్‌లను అందుబాటులోకి తేవాలి



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మోడల్ మార్కెట్లు నిర్వహించాలి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై ఏర్పాటు చేస్తున్న వారాంతపు సంతలను మరోచోటకు మార్చాలి. మంజీరా రోడ్డులో నిర్వహించే సంతను అంతర్గత రోడ్లపై నిర్వహించాలి.

– అశోక్, మదీనాగూడ

### ఖాళీ స్థలాలో ఏర్పాటు చేసేలా చూడాలి



వారాంతపు సంతలు రోడ్లపై కాకుండా కాలనీలలోని ఖాళీ స్థలాలలో ఏర్పాటు చేస్తే వాహనదారులకు ఇబ్బందులు ఉండవు. మిగిలిన కూరగాయలు వేయడానికి చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలి. సంత మరుసటి రోజు చెత్తను శుభ్రత చర్యలు చేపట్టాలి.

– కృష్ణ, మదీనాగూడ

## వేడుకగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న ఆలయ ఈవో లావణ్య

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేకం వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండు రోజు గురువారం ఉదయం గోపూజ, గవ్యాంత పూజలు, వాస్తుపూజ, వాస్తు హోమం, నిత్యోపాసన నిర్వహించారు. సాయంత్రం శంకరరామం గురుస్వామి బృందంచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన మహాసుదర్శన హోమంలో ఆలయ ఈవో ఎస్.లావణ్య పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

## ● ప్రారంభం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న పింకీ రెడ్డి

లక్డీకాపూల్: భాగ్యనగరం సంప్రదాయ, ఆధునిక వస్త్రాల మేలు కలియక అని ఫ్యాషన్, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులు పింకీ రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్రాంటియర్ రాస్ స్టోర్‌ను సుధారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పింకీ రెడ్డి మాట్లాడుతూ... నగర ఫ్యాషన్ ప్రియుల మనస్సు దోచే వస్త్ర నిలయంగా ఈ స్టోర్ నిలుస్తుందన్నారు. ఫ్రాంటియర్ రాస్ కేవలం స్టోర్ మాత్రమే కాదని, ఇది కళాత్మకత సంస్కృతి, ఫ్యాషన్‌ల వేదిక అని ఆ స్టోర్ డైరెక్టర్లు అవీర్, హమీదాలు పేర్కొన్నారు.